

ప్రాజెక్టు పనులను పరిశీలించిన మంత్రి

ప్రజాశక్తి- సోమల: మండలంలోని ఆవులపల్లి వద్ద రూ.750 కోట్లు పైగా నిధులతో నిర్మిస్తున్న ప్రాజెక్టు నిర్మాణ పనులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతంగా నాణ్యతగా నిర్వహించాలని ఆయన అక్కడి సిబ్బందిని ఆదేశించారు. రాష్ట్ర వైసిపి కార్యదర్శి పెద్దిరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


ఆవులపల్లి ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

గ్యాస్ భగభగలు

- రూ.50 పెంపుతో రూ.1130కి పెరిగిన ధర
- ఉమ్మడి జిల్లావాసులపై రూ.7కోట్లపైనే భారం





ప్రజాశక్తి-తిరుపతి టౌన్

గ్యాస్ ధర మళ్లీ పెరిగింది. గృహిణులకు కష్టాలు తప్పడం లేదు. మోడి ప్రభుత్వం రూ 50 రూపాయిలు పెంచడంతో సిలెండర్ ధర రూ.1130కు చేరుకుంది. ఉమ్మడి చిత్తూరుజిల్లా వాసులపై సుమారు 7 కోట్లపైనే భారం పడనుంది. పెరిగిన ధర బుదవారం నుంచి అమల్లోకి వచ్చింది. గత ఏడాది మార్చి, మే, జులై నెలల్లో రూ 150 పెరిగింది. ఈ లెక్కన ఈ ఏడాది డిసెంబర్ నాటికి సిలెండర్ రూ.1500కు చేరవచ్చని అంచానా. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా, గ్యాస్‌ధర ఏమాత్రం తగ్గకపోవడం గమనార్హం.

కేంద్రంలో మోడి ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలు ముగిసిన తరువాత గ్యాస్, చమురు ధరలు పెంచేసింది. ధరలు పెంపు విషయంలో ఇటు కేంద్రం, అటు రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం తగ్గడం లేదు. ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం ఆర్‌టిసి చార్జీలు పెంచడం వల్ల సామాన్య మద్యతరగతి ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా మారింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుమారు 15,89,752కనెక్షన్లుఉన్నాయి. ఇందులో ఇండియన్ గ్యాస్ సిలిండర్లు 5లక్షల 50వేలు ఉన్నాయి. హెచ్‌పి గ్యాస్ సిలిండర్ సుమారు 7లక్షల86వేలపైగా ఉన్నాయి. భారత్‌గ్యాస్ సుమారు 1లక్ష70వేల కనెక్షన్లు కలిగి ఉన్నట్లు డీలర్లు పేర్కొన్నారు. నిత్యం 75వేల సిలిండర్లు అమ్మకాలు జరుగుతున్నాయి.

2020నుంచి వినియోగదారులకు సబ్సిడి రావడం లేదు. 14.2కిలోల గ్యాస్ సిలెండర్ కు 1105 చెలిస్తే తప్ప సిలిండర్ ఇంటికి వచ్చే పరిస్థితి లేదు. ఎంత పొదుపుగా వాడాలనుకున్న నెలరోజులకు మించి రావడం కష్టంగా ఉంది. ఇంటి అవసరాలకు వినియోగించే వంటగ్యాస్ సిలిండర్ ధర గతఏడాది మార్చి మొదటివారంలో నాటికి రూ 935 ఉండగా మార్చినెల మూడవవారం నుంచి 985కు చేరింది. ఏకంగా రూ 50పెంచి వినియోదారుడిపై ప్రభావం పడింది. మేనెలలో సిలిండర్ కోనుగోలు చేయాలంటే రూ 1035రూపాయిలు చెల్లించి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జులై నెలల్లో కేంద్ర ం మరో 50రూపాయిలు పెంచడంతో సింగిల్ సిలిండర్ ధర డెలివరి బాయ్‌కు రూ50కలిపి రూ 1105రూపాయలకు చేరుకుంది. ప్రసుత్తం 50పెంచడం వల్ల 1130తిరుపతి లో ఈధర చెల్లించి సిలిండర్ తీసుకుంటున్నారు. ఇటు గ్యాస్, అటు అన్ని వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఏం కోనుగోలు చేసిన పర్సు ఖాళీ కావాల్సిందే.

గృహిణులపై పెను భారమే : రాధమ్మ



పెంచిన గ్యాస్ వల్ల గృహిణులపై పెనుభారం పడుతుంది. తక్షణమే గ్యాస్ ధరలు తగ్గించాలి. కేంద్ర ప్రభుత్వం ఇష్టం వచ్చిన్నట్లు గ్యాస్‌ధరలు పెంచితే సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎలా బతకాలి. ఇప్పటికే అన్ని వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే గ్యాస్‌పై రూ 50పెంచడం దారుణం. ధరలు తగ్గించకపోతే మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుంది.

పోరాటం చేస్తేనే : లక్ష్మి



గ్యాస్ ధరలు తగ్గించకపోతే మహిళలు పెద్ద ఎత్తున పోరాటం చేస్తారు. దీంతో ప్రభుత్వం దిగి రాక తప్పదు. ఎన్నాళ్లని ధరల భారంతో ప్రజలు ఇబ్బందులు పడుతూ బతుకుతారు. సహనం నశిస్తే పోరాటాల్లోకి తప్పనిసరిగా వస్తారు. ఇలా పెంచుకుంటూ పోతే గ్యాస్ రూ 2వేలరూపాయిలు పెంచిన ఆశ్చర్యం లేదు. ధరలు తగ్గించే వరకు మహిళలు పోరాటాల్లో ముందుండాలి.

గ్యాస్ ధరల పెంపును ఉపసంహరించుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు



చిత్తూరుఅర్బన్: కేంద్ర బిజెపి ప్రభుత్వం గృహవినియోగానికి ఉపయోగించే ఎల్‌పిజి గ్యాస్ సిలెండర్ ధర రూ.50లు, వాణిజ్య సిలెండర్ రూ.350లు పెంచడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు తీవ్రంగా ఖండించారు. గ్యాస్ సిలెండర్ ధర పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటి సామాన్య ప్రజలు దుర్భరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గ్యాస్ ధరలు రెండు నెలల వ్యవధిలో రెండు సార్లు పెంచడం దారుణమన్నారు. 3 సంవత్సరాల క్రితం వరకు రూ.417లున్న డొమెస్టిక్ గ్యాస్ సిలెండర్ ధర నేడు రూ.1155లకు పెరిగిందన్నారు. ప్రభుత్వం సబ్సిడీ జమలు రెండు సంవత్సరాల నుంచి నిలిపివేసిందని, ఇప్పటికే గృహవినియోగానికి సబ్సిడీ కింద ఇచ్చే సిలెండర్ల సంఖ్య కుదించారని అన్నారు. ఇది పూర్తిగా పేద, మధ్యతరగతిపై దాడి తప్ప మరొకటి కాదని విమర్శించారు. వాణిజ్య సిలెండరు ఒక్కసారిగా రూ.350లు పెంచడం వల్ల స్వీయఉపాధి పొందుతున్నవారని, చిరువ్యాపారులపై తీవ్రప్రభావం పడుతుందన్నారు. ఆర్థిక మాంద్యం వలన చితికిపోతున్న స్వయం ఉపాధి మరింత దుర్భర స్థితికి చేరుకుంటుందన్నారు. ఉపాధిలేక, వేతనాలు చాలక ద్రవ్యోల్బణం పెరిగిపోతున్న నేపథ్యంలో ధరలు నియంత్రించాల్సిన ప్రభుత్వం మూలిగే నక్కపై తాటి పండులా భారాలు మోపడం గర్హనీయమన్నారు. మరోవైపు కార్పొరేట్లకు రాయితీలిచ్చి దేశాన్ని దోచిపెడుతున్నారని, వంటగ్యాస్ ధరల పెంపును ఉపసంహరించి, సబ్సిడీని పునరుద్ధరించాలని సిపిఐ(ఎం) డిమాండ్ చేస్తున్నదన్నారు. పెంచిన ధర ఉపసంహరించే వరకు ఎక్కడికక్కడ నిరసనలు చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి


ఎమ్మెల్సీ ఎన్నికలపై రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు నియోజకవర్గం పట్టభద్రుల, ఉపాధ్యాయల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు అవగాహన కలిగించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ మరియు డిఆర్ఓ ఎన్.రాజశేఖర్‌తో కలిసి బుధవారం సాయంత్రం స్థానిక జిల్లా కలెక్టరేట్ సమావేశం హాల్‌లో ఈనెల 13న, 16న జరిగే ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు నియోజకవర్గాలు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జేసి మాట్లాడుతూ పట్టభద్రుల, ఉపాధ్యాయల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు పూర్తి అవగాహన కలిగించాలని అన్ని రాజకీయ పార్టీల నాయకులకు చూచించారు. పిఓ ఇచ్చిన మార్కర్ పెన్‌తోనే ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎలక్షన్ కమిషన్ అప్రూవల్ చేసిన పోలింగ్ కేంద్రాలు జాబితాను అన్ని రాజకీయ పార్టీలకు అందజేయడం జరిగిందన్నారు. పట్టభద్రుల సంబంధించి ఓటు హక్కు వినియోగించే ఓటర్లకు ఎడమచేతి చూపుడు వేలుకు, ఉపాధ్యాయుల సంబంధించి ఓటు హక్కు వినియోగించే ఓటర్లుకు కుడి చేయి మధ్య వేలుపై మార్కింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఓటుహక్కు వినియోగించుకునేవారు తప్పనిసరిగా ఏ దైన గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకు రావాలి, ఓటర్ ఐడి కార్డు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాస్‌పోర్టు, పట్టాదార్ పాస్ పుస్తకం, ప్రభుత్వ ఉద్యోగులు అయితే ఆ శాఖకు సంబంధించిన ఐడి కార్డును ఏదైనా ఒక్కటి గుర్తింపు కార్డుతో వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవనని తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీకి బ్యాలెట్ పేపర్ తెలుపు రంగు గాను, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ కి బ్యాలెట్ పేపర్ పింక్ కలర్‌లో ఉంటుందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్ర పరిధిలో ఓటు ఎలా వేయాలి (హౌ టు ఓట్) దానికి సంబంధించి పోస్టర్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్ నియమించుకునే అభ్యర్థులు పిఓ ద్వారా ఐడి కార్డు పొందవచ్చునని తెలిపారు. ఈనెల 13న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, ఈనెల 16న ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం ప్రారంభంవుతుందన్నారు. పట్టభద్రులకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాన్ని ఆర్‌విఎస్ కళాశాలలో ఉపాధ్యాయుల ఓట్లు లెక్కింపుకు సంబంధించి లాకాలేజ్‌లో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఓట్లు లెక్కింపు కేంద్రంలోనికి ఫారం-18 ద్వారా పాస్ పొందవలసి ఉంటుందన్నారు. పట్టభద్రుల ఓట్లు లెక్కింపుకు 20 టేబుల్‌ను, ఉపాధ్యాయుల ఓట్లు లెక్కింపునకు 14 టేబుల్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పట్టభద్రుల ఉపాధ్యాయుల ఎమ్మెల్సీకి ఓట్లు వేయు ఓటర్లకు బిఎల్ఓల ద్వారా ఓటర్ స్లిప్పులు అందజేసి, ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలని దానిపై ఓటర్లకు అవగాహన కలిగించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తరపున ఎమ్మెల్యే పిఆర్ఓ నరసింహులు, తెలుగుదేశం పార్టీ తరపున రాష్ట్ర కార్యదర్శి వి.సురేంద్ర కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, బిజెపి జిల్లా జనరల్ సెక్రటరీ కె.చిట్టిబాబు, కాంగ్రెస్ పార్టీ తరపున పరదేసి పాల్గొన్నారు.

చిత్తూరుకు మరో మండలం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాష్ట్రంలో జిల్లాల విభజన నేపథ్యంలో ఆరు కొత్త, పాత జిల్లాలకు రూరల్ మండలాలు లేవు. చిత్తూరు జిల్లా 31 మండలాలతో రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 4న ప్రకటించింది. అయితే చిత్తూరు జిల్లాకు అర్బన్‌తో పాటు రూరల్‌ను ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై చిత్తూరు సరిహద్దు ప్రాంతమంతా రూరల్‌గా పరిగణనలోకి తీసుకుంటారు. దీంతో 32 మండలాలు కానుంది.

పిడిఎఫ్ అభ్యర్థులకు కాంగ్రెస్ మద్దతు

పీసీసీ సభ్యులు బి.ఇనాయ్ తుల్లాఖాన్

ప్రజాశక్తి- వికోట

త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో శాసనమండలిలో నిరంతరం ప్రజాసమస్యలు ప్రస్తావిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులకు తమ మద్దతు ఉంటుందని కాంగ్రెస్ పిసిసి సభ్యులు బి.ఇనాయ్ తుల్లా ఖాన్ ప్రకటించారు. బుధవారం వీకోటలో తన స్వగహంలో సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు, జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, జిల్లా నాయకులు భువనేశ్వరీల సమక్షంలో మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయస్థాయిలో బిజెపి, రాష్ట్రంలో వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వాలు ప్రజాసమస్యలు పరిష్కారం చేయడంలో పూర్తిగా విఫలమైనాయని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి వేగంగా బిల్లులు తీసుకురావడం దుర్మార్గమన్నారు. వాటిని అడ్డుకోవడానికి అన్ని శక్తులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. అందుకే నిరంతరం ప్రజాసమస్యలు ప్రస్తావించే అభ్యర్థులకు మద్దతు ఉంటుందని తెలిపారు. పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపు కోసం జిల్లాలో కాంగ్రెస్‌పార్టీ పనిచేస్తుందని ప్రకటించారు. ఈ సమావేశంలో కార్యకర్తలు పాల్గొన్నారు.


పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతు ప్రకటిస్తున్న కాంగ్రెస్ నేత ఇనయ్ తల్లాఖాన్

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

ఉద్యోగ, ఉపాధ్యాయ, అవుట్సోర్సింగ్, కార్మికుల మద్దతుతో పిడిఎఫ్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న బాబురెడ్డి, వెంకటేశ్వరరెడ్డిలకు ఓట్లు వేసి గెలిపించాలని కోరుతూ సిఐటియు, ఏఐటిసి నాయకులు బుధవారం పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో విస్తత ప్రచారం నిర్వహించారు. ఉద్యోగ ఉపాధ్యాయుల పక్షాన నిలబడి శాసనసభలో ప్రశ్నించే పిడిఎఫ్ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు చైతన్య, సురేంద్ర, ప్రసాద్, ఎఐటియుసి నాయకులు సత్యమూర్తి, దాసరి చంద్ర, రమాదేవి, కుమారి పాల్గొన్నారు.


పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో ప్రచారం చేస్తున్న నాయకులు

పీఓలు, ఏపీవోల పాత్ర కీలకం

ఎన్నికల నిర్వహణలో పొరపాట్లకు తావులేదు : కలెక్టర్
ఎన్నికల నిబంధనలు పాటించాలి : జెసి
మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణలో పిఓలు, ఏపిఓల పాత్ర కీలకమని, పోలింగ్ నిర్వహణపై వీరికి పూర్తి అవగాహనను కల్పించేందుకు శిక్షణా తరగతులను నిర్వహించడం జరుగుతున్నదని జిల్లా కలెక్టర్ యం.హరి నారాయణన్ పేర్కొన్నారు. ఈనెల 13న ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులుగా నియామకం కాబడ్డ వారికి ఎన్నికల నిర్వహణకు సంబంధించి శిక్షణా తరగతులు బుధవారం పివికెఎన్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ శిక్షణా తరగతులను జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తో కలసి తరగతుల నిర్వహణను పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు పట్టభద్రుల, ఉపాధ్యాయులు నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికలు మార్చి 13న జరగ నున్నాయని, పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందన్నారు. పిఓలు, ఏపిఓలు ఎన్నికల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పోలింగ్‌నిర్వహణపై పూర్తి అవగాహనను పెంపొందించేందుకు శిక్షణా తరగతులను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈతరగతులలో పూర్తి అవగాహనను పెంపొందించుకొని పకడ్బందీగా పోలింగ్‌ను నిర్వహించేందుకు సన్నద్ధం కావాలన్నారు. నేడు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులతో పాటు మరోమారు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం ప్రిసైడింగ్ అధికారులకు ఇచ్చిన హ్యాండ్ బుక్‌లోని అంశాలను క్షుణ్ణంగా అర్థంచేసుకుని అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఎన్నికల నిర్వహణ రోజున బ్యాలెట్ బాక్సుల నిర్వహణ, బ్యాలెట్ పేపర్లు, పిఓ డైరీ, తదితర అంశాలపై అవగాహన ఉండాలన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను సీల్ వేయుట తదితర అంశాలపై అవగాహన ముఖ్యమన్నారు. పోలింగ్ నిర్వహణకు సంబంధించి పిఓలు, ఏపిఓలుగా నియామకమైన అధికారులు అందరూ వారికి కేటాయించిన రెవెన్యూ డివిజన్ అధికారికి ఈనెల 12న రిపోర్ట్ చేయాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ సామగ్రిని అదే రోజున తీసుకుని వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్‌కు సాయంత్రంకు చేరుకోవలసి ఉంటుందని తెలిపారు. పోలింగ్ సిబ్బంది చెక్‌లిస్టు మేరకు ప్రతిఅంశాన్ని పరిశీలించుకోవలసి ఉంటుందని అన్నారు. పోలింగ్ రోజున పోలింగ్ ఏజెంట్‌లకు పాసుల పంపిణీ వారికి సీటింగ్ ఏర్పాట్లు ఉదయం 7 గంటలకు పూర్తిచేసి 8 గంటలకు పోలింగ్ ప్రారంభమయ్యేలా ప్రిసైడింగ్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు క్యాబిన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రిసైడింగ్ అధికారులు (పిఓ) అనివార్య కారణాల వల్ల హాజరు కాలేకపోతే సహాయప్రిసైడింగ్ అధికారులు పిఓలుగా వ్యవహరిస్తారని, ఓపిఓలు ఇద్దరు సహాయకులుగా ఉంటారని అన్నారు. పోలింగ్ పూర్తి అయిన అనంతరం ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను సీల్ చేసి సంతకాలు తీసుకొని రెవెన్యూ డివిజన్ రిసెప్షన్ సెంటర్ స్ట్రాంగ్ రూమ్‌కు బ్యాలెట్ బ్యాక్‌లను చేర్చాల్సి ఉంటుందని దీనితో పాటు పిఓ డైరీ ఇతర ప్రొఫార్మాలను అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ఓ, డిఆర్ఓ ఎన్. రాజశేఖర్, జెడ్‌పి సీఈవో ప్రభాకర్ రెడ్డి, చిత్తూరు, నగరి, పలమనేరు, కుప్పం ఆర్‌డిఓలు రేణుకా, సృజన, శివయ్య, నోడల్ అధికారులు, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


పిఓలు, ఏపీఓల శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న కలెక్టర్, జెసి, డిఆర్ఓ

ఎన్నికల నిబంధనలు పాటించాలి : జెసి

ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించే విధంగా ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు లోబడి పనిచేయాలని, బహిరంగ సభలు, ర్యాలీలు నిర్వహించుకోవాలంటే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. బుధవారం సాయంత్రం డిఆర్ఓ ఎన్.రాజశేఖర్‌తో కలసి పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థులతో జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జెసి మాట్లాడుతూ అభ్యర్థులు ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఇప్పటికే అభ్యర్థుల జాబితా విడుదల చేయడం జరిగిందని, బ్యాలెట్ పేపర్‌లలో దాని ప్రకారమే అభ్యర్థుల పేర్లు తెలుగులో ముద్రించబడి ఉంటాయని, పేర్ల పక్కనే ప్రాధాన్యతా గడి ఉంటుందని, అభ్యర్థులు క్షేత్రస్థాయిలో ఓటర్లకు అవగాహన కల్పించేందుకు సహకరించాలని తెలిపారు. పోలింగ్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గ్రాడ్యుయేట్లకు, టీచర్లకు వేరువేరుగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయబడినవని తెలిపారు. పోలింగ్ ఏజెంట్లుగా నియమింపబడేవారు వారి జాబితాలను ఆయా జిల్లాలలో సంబంధిత అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు అయిన డిఆర్‌ఓలకు 9వ తేదీలోగా అందించాలన్నారు. ఏజెంట్లు పోలింగ్ రోజున ఉదయం వారికి సంబంధించిన వివరాలు ఫోటోతో సహా సమర్పించి ఐడి పొందాలన్నారు. ఎన్నికల ఖర్చుకు సంబంధించిన వివరాలు తప్పనిసరిగా ఎన్నికల ప్రక్రియ పూర్తి అయిన తర్వాత సమర్పించాలని తెలిపారు. 11వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఎన్నికల ప్రచారం ముగుస్తుందని తెలిపారు. ఏజెంట్ నియామకంతో పాటు వాహనాలకు అనుమతి కావాలంటే సంబంధిత డిఆర్‌ఓలను సంప్రదించాలన్నారు. ప్రచారం నియమ నిబంధనలకు లోబడి నిర్ణయించిన కాలంలోనే చేయాలని అన్నారు. కరపత్రాలు ముద్రించేవారు తప్పనిసరిగా ప్రింటింగ్ ప్రెస్ పేరు, ముద్రించిన కరపత్రాల సంఖ్యను తప్పనిసరిగా వేయాలని, పోలింగ్ కేంద్రంలో ఓటును వినియోగించుకోవడానికి ఎన్నికల సంఘం ఇచ్చిన పెన్‌ను వాడాలన్నారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమించి ఓటు వినియోగించుకున్నట్లయితే అది ఇన్ వాలీడ్ ఓటుగా పరిగణించడం జరుగుతుందని అన్నారు. అభ్యర్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు.

13న పోలింగ్
16న ఓట్లు లెక్కింపు
పిఓ అందజేసిన మార్కర్ పెన్‌తోనే నెంబర్ మార్క్ చేయాలి

పట్టభద్రులు
చిత్తూరు జిల్లాకు సంబంధించి : 54,152 మంది ఓటర్లు
పురుషులు : 35,189 మంది
మహిళలు : 18,960 మంది
పోలింగ్ కేంద్రాలు : 69

ఉపాధ్యాయులు
చిత్తూరు జిల్లాకు సంబంధించి : 3887 మంది
పురుషులు : 2341 మంది
మహిళలు : 1546 మంది
పోలింగ్ కేంద్రాలు : 31

మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు

ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం మార్గదర్శక సూత్రాల ప్రకారం జిల్లాస్థాయి మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసిఎంసి) ఏర్పాటు చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని డిఆర్ఓ ఎన్.రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ యం. హరి నారాయణన్ ఛైర్మన్ గానూ, ఏఆర్ఓ, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్, సెంట్రల్ బ్యూరో కమ్యూనికేషన్ ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్ కాస్టింగ్‌కు చెందిన ఆల్ ఇండియా రేడియో ప్రోగ్రాం ఎగ్జిక్యుటివ్ ఎం.సుధాకర్ సభ్యులుగానూ, జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి బి.పద్మజ మెంబెర్ సెక్రటరీ గానూ ఉన్నారని తెలిపారు. వీరు ప్రతిరోజూ ప్రింట్‌అండ్ ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలను నిరంతరం పరిశీలించి ప్రకటనలు, చెల్లింపు వార్తలు గుర్తించి సంబంధిత అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల కింద చూపుతారని తెలిపారు. అభ్యర్థులు గాని, వారి తరపున వ్యక్తులు గానీ ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలు జారీ చేస్తున్నచో అందుకు సంబంధించిన ప్రకటనలు మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీకి అందజేసి ముందస్తు అనుమతి పొందవలసి ఉంటుందని తెలిపారు. అనుమతి కొరకు చిత్తూరు కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఎంసిఎంసి కమిటీని సంప్రదించాల్సి ఉంటుందని, పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజున ప్రింట్ మీడియాలో ప్రకటనల కొరకు తప్పనిసరి ధవీకరణ పొందాల్సి ఉంటుందని తెలిపారు.

కేసులు పెండింగ్ లేకుండా చర్యలు చేపట్టాలి: ఎస్పీ


పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ రిషాంత్ రెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కుప్పం రూరల్ సర్కిల్ పరిధిలోని రామకుప్పం, రాల్లబుదుగూరు, గుడుపల్లి పోలీస్ స్టేషన్‌లను చిత్తూరు జిల్లా ఎస్పీ రిశాంత్ రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసుస్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్‌రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా రోడ్డుప్రమాదాల నియంత్రణకు సర్కిల్ పరిధిలో తీసుకున్న చర్యలను సమీక్షించారు. బ్లాక్ స్పాట్స్ దగ్గర రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకున్న చర్యలను సమీక్షించారు. రోడ్డుభద్రతా నియమాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలన్నారు. డ్రంకన్ డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. హత్యలు, హత్యాయత్నాలు, క్రైమ్ ఎగైనెస్ట్ ఉమన్, గర్ల్ మిస్సింగ్, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, 174 సిఆర్ పిసి తదితర కేసుల రికార్డ్సను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు తీరుతెన్నులు వాటి పురోగతిపై కేసుల ఫైల్స్ ను క్షుణ్ణంగా పరిశీలించి నిందితులు అరెస్ట్ కాని కేసులలో నిందితులను త్వరగా అరెస్ట్ చేయాలని ఆదేశించారు. సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా పోలీస్‌స్టేషన్ అధికారులను ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ముఖ్య మైన కేసులు, పాత గ్రేవ్ కేసులను సమీక్షించారు. స్టేషన్‌లోని క్రైమ్ రికార్డ్సను, కేసు డైరీ, రిజిస్టర్‌లను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. పోలీస్‌స్టేషన్లో నమోదైన, కేసుల్లో వత్తినైపుణ్యత, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి త్వరితగతిన విచారణ పూర్తిచేసి, నిర్దేశిత కాలవ్యవధిలో కోర్టులో ఛార్జ్ షీట్ ఫైల్‌చేసి, సమర్థవంతమైన ట్రయిల్ ద్వారా నిందితులకు కఠినశిక్ష పడేలా చేయాలని సూచించారు. సివిల్, భూ తగాదాలు, పాత గొడవల్లోని, నాటు సారా అమ్ముతున్నారని అనుమానం ఉన్న వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేయాలని సూచించారు. పోలీసు స్టేషన్ పరిధిలో గల స్కూల్స్ వద్ద, హోటల్స్, లాడ్జిలు, లాంటి ప్రదేశాలలో నిఘా ఏర్పాటు చేయాలని, ఎక్కువగా విజిబుల్ పోలీసింగ్ చేయాలని, సమర్థవంతమైన నేర నియంత్రణ, నివారణ చర్యలు చేపట్టాలని, అదేవిధంగా రాత్రి, పగల బీట్ల పనితీరును నిరంతర మానిటరింగ్ చేయాలని, అప్పుడు నేరాలు తగ్గుతాయని తెలిపారు. రౌడీషీటర్ల కదలికలు, కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పలమనేరు ఎస్‌డిపిఓ ఎన్.సుధాకర్ రెడ్డి, ఎస్‌బి. డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, కుప్పం అర్బన్ సిఐ శ్రీధర్, కుప్పం రూరల్ సిఐ రియాజ్ అహ్మద్, ఎస్‌ఐలు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తసేకరణ కేంద్రాలు నిరుపయోగం



చెత్త సేకరణ లేక కొన్ని కేంద్రాలకు తాళం

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలో సంపద కేంద్రాలు సంపదను సృష్టించలేక పోతున్నాయి. లక్ష్యం నెరవేరక కేంద్రాలకు తాళం వేస్తున్నారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో ఇంటి దగ్గర నుంచి తడి, పొడి చెత్త వేరు చేసి వాటిని ఎరువుగా తయారుచేసి దాన్ని రైతులకు విక్రయించి దాంతో జీతాలు తీసుకోవాలని చెబుతుంది. కానీ ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు. ఈ కేంద్రాలకు తాళం వేసిన వైనం కనిపిస్తుంది. ఇందుకు సంబంధించి వివరాలు...చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధిలో, వెదురుకుప్పం మండలంలో 25 పంచాయతీలు ఉన్నాయి. వాటిలో 20 పంచాయతీలకు సంపద కేంద్రాలు ఉన్నాయి. మొండి వెంగన్నపల్లె, సంతబైలు, ఇనాయతుల్లా, ఆళ్మడుగు, దేవరగుడిపల్లె, ఘంటావారిపల్లె, ఈ ఐదు పంచాయతీలకు సంపద కేంద్రాలు లేవు. దీనికి కారణం స్థల సమస్య అని స్థానికులు చెబుతున్నారు.

సంపద కేంద్రాల ఏర్పాటుకు కారణాలు: గ్రామాల్లో రోజూ చెత్తాచెదారం పేరుకుపోయి నివాస ప్రాంతాల్లో ఇబ్బందిగా మారుతుందని ఉద్దేశంతో ఈ సంపద కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రామాల్లోని ప్రతి కుటుంబంలో తడి, పొడి చెత్త వేరు చేయాలి. వాటిని సంపద కేంద్రాల్లోని తొట్టిలో వేరు వేరుగా వేయాలి. అనంతరం ఎర్రల సహాయంతో ఆ చెత్తను కుళ్ళ పెట్టాలి. గ్రామాల్లో వాటర్ బాటిల్స్, ప్లాస్టిక్ వేరు చేయాలి. సంపద కేంద్రాల్లో కుళ్ళపెట్టిన చెత్తను ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు రైతులకు విక్రయించుకోవాలి. వాటితో వచ్చిన సంపదను గ్రీన్ అంబాసిడర్లు జీతం రూపంలో తీసుకోవాలి. స్థానికులు పనికి రాకుండా పడేసిన వస్తువులను సేకరించి, వాటి ద్వారా సంపదను సృష్టించడమే వీటి ముఖ్య ఉద్దేశ్యం. మండలంలో ఒకటి, రెండు తప్ప మిగతా సంపద కేంద్రాల్లో గ్రీన్ అంబాసిడర్లు విధుల్లో లేరని సమాచారం.

సంపద కేంద్రాల పనితీరు ఇలా...: మండలంలో ఈ సంపద కేంద్రాల్లో మొత్తం 61 మంది గ్రీన్ అంబాసిడర్‌లు ఉన్నారు. వీరికి ఒక్కొక్కరికి రూ.6 వేల చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. కొంతకాలం స్వచ్ఛభారత్‌లో భాగంగా జీతాలు చెల్లించారు. అనంతరం 15వ ఆర్థిక సంఘం నుంచి జీతాలు చెల్లించారు. ప్రస్తుతం పంచాయతీ ఖాతాల్లో నుంచి వీరి జీతాలు ఇస్తున్నట్లు సమాచారం. గ్రీన్ అంబాసిడర్లు గ్రామాల్లో రోజూ ఉదయం తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకి చేర్చాలి. అనంతరం ఎరువుగా మార్చే ప్రక్రియ మొదలు పెడతారు.

వినియోగంలోకి తెస్తాం



మండలంలో ఒకటి, రెండు తప్ప మిగిలిన వాటిలో గ్రీన్ అంబాసిడర్లు లేకపోవడం వాస్తవమే. గ్రీన్ అంబాసిడర్లకు అవగాహన కల్పించి, సర్పంచులతో మాట్లాడి జీతాలు చెల్లించే విధంగా చేస్తాం. ప్రజల దగ్గర నుంచి నామమాత్రపు రుసుం వసూలు చేస్తాం. మండలాల్లో మిగిలిన పంచాయతీలలో రెవెన్యూ వారితో మాట్లాడి డంపింగ్ యార్డ్‌కు స్థలం కేటాయించే ప్రయత్నం చేస్తాం. వాటిని కూడా నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం **-సుధాకర్ రావు, ఎంపీడీవో, వెదురుకుప్పం**

పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పెద్దిరెడ్డి



ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఆవులపల్లె గ్రామంలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం మంత్రి ఆలయం వద్ద టిటిడి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు మెంబర్ అశోక్ కుమార్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలపై అవగాహన

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధి లోని దేవదొడ్డి గ్రామంలో వైద్యాధికారి ఆదేశాలతో వడదెబ్బ తగలకుండా ముందస్తు జాగ్రత్తలపై మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చెమట పట్టకపోవడం, మగతగా ఉండడం, తలతిరగటం, విపరీతంగా దాహంగా ఉండటం, స్పృహ కోల్పోవటం వంటి లక్షణాలు ఉన్నప్పుడు వడదెబ్బ తగిలే అవకాశం ఉంటుంది. పై లక్షణాలున్నప్పుడు మంచినీరు, టెంకాయ నీళ్లు, నిమ్మ రసం, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం, కాచి చల్లార్చిన నీరు అందివ్వడం ద్వారా వడదెబ్బ తగలకుండా నివారించవచ్చునన్నారు. ప్రజలు మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు బయటికి రావద్దని, దాహం వేయకపోయినా వీలైనప్పుడల్లా తగినన్ని నీళ్లుతీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీదేవి, ఎఎన్ఎం వినాయకమ్మ, ఆశా సరిత, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

నివాళులర్పించిన గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి-నగరి: మున్సిపాలిటీ పరిధిలోని చింతలపట్టెడకు చెందిన కార్తీక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మంగళవారం తుది శ్వాస విడిచాడు. బుధవారం కార్తీక్ నివాసంలో టిడిపి నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భాను ప్రకాష్ మతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. అనంతరం ఇటీవల మరో ఘటనలో మృతిచెందిన భాస్కర్ కుటుంబ సభ్యులను పరామర్శించి, అతని చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన డైట్ అధ్యాపకురాలు



ప్రజాశక్తి-కార్వేటినగరం: మధ్యప్రదేశ్‌లోని భోపాల్ రవీంద్రనాథ్ ఠాగూరు యూనివర్శిటీ వారు నిర్వహించిన షోద్ శిఖర్ పేరుతో అంతర్జాతీయ రీసెర్చ్ ప్రాజెక్టులో జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్) అధ్యాపకురాలు వరలక్ష్మి ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమని డైట్ ప్రిన్సిపల్ శ్రీరాం పురుషోత్తం అన్నారు. బుధవారం డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందనీయ సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ రవీంద్రనాథ్ ఠాగూరు యూనివర్శిటీలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ప్రాజెక్టు సింపోజియంలో ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ కమిషనర్‌చే నియమించబడిన అధ్యాపకురాలు వరలక్ష్మితో పాటు ఛాత్రోపాధ్యాయులు ఎస్.సుస్మిత, జనని, ఎన్.హేమ కలిసి కళాధారిత విద్యా విధానంపై వర్లి ఆర్ట్ ఒక పరిశోధన ప్రాజెక్టును ప్రదర్శించారని పేర్కొన్నారు. ఈ ప్రదర్శన అంతర్జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడంతో భోఫాల్ యూనివర్శిటీ వారు ప్లాటినం కేటగిరి కింద ప్రశంసాపత్రం, రూ.15 వేలు నగదు బహుమతిని అందించినట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి 60 ప్రాజక్టులు హాజరు కాగా వాటిలో ప్రథమ స్థానంలో మన కళాశాల నిలిచి జిల్లా డైట్ పేరు ప్రఖ్యాతులను అంతర్జాతీయ స్థాయిలో తెలియజేసిన అధ్యాపకురాలు, ఛాత్రోపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు చెంగల్రాజు, సునీతదేవి, నిర్మలాదేవి, భాస్కర్‌రెడ్డి, నాగరాజునాయక్, ప్రభాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-సోమల: సదుం మండలంలోని మహాత్మా జ్యోతీరావు పూలే గురుకుల పాఠశాలలో బుధవారం వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర వైసీపీ కార్యదర్శి పెద్దిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని అన్నారు. ప్రతి సంవత్సరంలా మంచి ఫలితాలను సాధించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులను అక్షింతలతో ఆశీర్వదించి సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి, ఉపాధ్యాయ బందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

3న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-సోమల: మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 3వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ కార్యాలయం వెనుక భాగాన ఉన్న సమా వేశపు మందిరంలో ఎంపీపీ ఈశ్వరయ్య అధ్యక్షతన నిర్వహించను న్నట్లు ఎంపీడీవో నాగరాజు తెలిపారు. సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీ లు, కోఆప్షన్ మెంబర్లు, మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ శాఖల పరిధిలోని పూర్తి నివేదికలతో హాజరుకావాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

ప్రథమ చికిత్సతో ప్రాణాన్ని కాపాడొచ్చు

ప్రజాశక్తి-కార్వేటినగరం: అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు, అత్యవసర సమయాలలో ప్రథమ చికిత్స చేసి ప్రాణాలు కాపాడవచ్చని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.విజయులు రెడ్డి తెలిపారు. బుధవారం కళాశాలలో యూత్ రెడ్‌క్రాస్, ఎన్ఎస్ఎస్, ఆర్ఆర్సీ కోఆర్డినేటర్ డాక్టర్ ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చిత్తూరు కోఆర్డినేటర్ చిరంజీవి సహకారంతో ప్రాథమిక ప్రథమ చికిత్సపై విద్యార్థులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణలో ప్రథమ చికిత్స అవసరాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గుండెపోటు వచ్చినప్పుడు సీపీఆర్ చేయు విధానాన్ని వివరించారు. అనంతరం విద్యార్థులతో సీపీఆర్ చేయు విధానాన్ని చేయించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న 58 మంది విద్యార్థులకు సర్టిఫికెట్స్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సి.ఎన్.లత, పూజారి వెంకటేశులు, స్వామి శివయ్య, జోగి ప్రసాద్, విష్ణుప్రియ, లావణ్య, జేకేసి మెంటర్ లోకేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన వాలంటీర్



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని దేవదొడ్డి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న రంగప్ప కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో పిఇఎస్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడు. దీంతో స్థానిక వాలంటీర్ మేఘశ్రీ సొంత ఖర్చులతో పిఇఎస్ హాస్పిటల్‌కు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ డబ్బులు రంగప్పకు అందించినట్లు బాధితుని కుటుంబ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు




ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈనెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలలో పకడ్బందీగా పోలింగ్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఎం.హరినారాయణన్, తహశీల్దార్లు, ఎంపీడీఓలను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ గుడిపాల, యాదమర్రి మండలాలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల ఉపాధ్యాయుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ మార్చి 13న నిర్వహించే ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ కేంద్రాలలో అవసరమైన విద్యుత్తు సౌకర్యం, ఇతర సదుపాయాలు ఉండేలా ఏర్పాట్లు చేయాలని ర్యాంపు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే వెబ్‌కాస్టింగ్ నిమిత్తం అవసరమైన ఇంటర్ నెట్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, పోలింగ్ కేంద్రాలలో పట్టభద్రుల, ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ బూత్ నెంబర్‌ను పెయింట్ చేయాలని సూచించారు. తప్పులకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు తహశీల్దార్‌లు, ఎంపిడిఓలు చర్యలు చేపట్టాలని సూచించారు.

పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వ సాయం



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం కొబ్బరి నూనె, సబ్బులు పంపిణీ చేశారు. నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఆదేశాల మేరకు ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, మెప్మా సీఎంఎం గోపి పర్యవేక్షణలో ప్రజారోగ్య విభాగంలో విధులు నిర్వహిస్తున్న 510 కార్మికులకు 2022-23 సంవత్సరానికి సంబంధించి ఒక్కొక్కరికి 4.2 లీటర్ల కొబ్బరి నూనె, 10 సబ్బులు అందించారు. కార్మికులకు నూనె, సబ్బులు తదితర వస్తువులను అందించడానికి పలుసార్లు టెండర్లు పిలిచినా స్పందన లేకపోవడంతో నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ జగనన్న మార్ట్ ద్వారా వస్తువులను కార్మికుల అందించడానికి చర్యలు తీసుకున్నారు. కార్మికుల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణ కోసం అవసరమైన అన్నిచర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ వివరించారు. త్వరలోనే చెప్పులు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు, పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

మాజీ మంత్రి సేవలు ప్రశంసనీయం



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: రాష్ట్ర మాజీ మంత్రి దివంగత గుమ్మడి కుతూహలమ్మ సేవలు ప్రశంసనీయమని టీడీపీ, కాంగ్రెస్, వైసీపీ, బీజేపీ, జనసేన నేతలు తెలిపారు. మండల పరిధిలోని వింజం పంచాయతీ వి.లక్ష్మిరెడ్డి దళితవాడలో మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ సమాధి వద్ద బుధవారం ఆమె కుమారుడు హరికష్ణ కర్మక్రియలు నిర్వహించారు. అనంతరం ఆమె చిత్రపటానికి పలువురు పూలు చల్లి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పరసారత్నం, మాజీ ఎమ్మెల్యేలు గాంధి, లలిత కుమారి, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, నియోజకవర్గ టిడిపి కోఆర్డినేటర్ భీమనేని చిట్టిబాబు నాయుడు, రిటైర్డ్ ఎస్పీ చిన్నస్వామి, నియోజకవర్గ జనసేన కన్వీనర్ యుగంధర్, నేతలు ఎర్రగుంట్ల కష్ణ నాయుడు, శ్రీధర్ యాదవ్, స్వామిదాస్, దేవరాజులు, తలారి రెడ్డెప్ప, దేవసుందరం, చిట్టిరెడ్డి, జ్యోతి యాదవ్, జీవరత్నం, బాలచంద్రారెడ్డి, నారాయణరెడ్డి, తులసి రెడ్డి, సంధాని, సంపత్, రవియాదవ్, ఉలగనాదం, వైసీపీ నేతలు వేల్కూర్ బాబు రెడ్డి, గుణశేఖర్ మొదిలి, సురూర్ మెహ్ది, కాంగ్రెస్ పార్టీ నాయకులు పోటుగారి భాస్కర్ నివాళులు అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

ఉద్యోగ సమస్యల పరిష్కారానికై ఏపీఎన్జీవోల పోరాటం



ప్రజాశక్తి-పలమనేరు: ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలను పలమనేరు ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు ఆనందబాబు ఆధ్వర్యంలో, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం సలహాదారు నలమూరు చంద్రశేఖర్ రెడ్డి మరియు రాష్ట్ర ఎన్జీఓ సంఘం ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, జిల్లా ఎన్జీఓ సంఘం అధ్యక్షులు రాఘవులు, జిల్లా కార్యదర్శి రఘుల చిత్తూరు ఎన్జీఓ హోంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో దష్టికి తీసుకెళ్లారు. వాటిలో ముఖ్యంగా సొసైటీ కార్పొరేషన్‌ల ఉద్యోగులకు 62 పదవీ విరమణ పెంపు, కరువు భత్యం, బకాయిలు, శిక్షణా ఎఎన్ఎంల సమస్యలు, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాల చెల్లింపులు, పెన్షనర్ల బకాయిలు, పదవీ విరమణ ప్రయోజనాల చెల్లింపు, జీతాల చెల్లింపుల్లో ఆలస్యం, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు బదిలీలు, గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శులకు డిడి ఓ సౌలభ్యం, నూతన పిఆర్సి అమలు, పలు శాఖలలో పెండింగ్లో ఉన్న పదోన్నతులు, ఖాళీల భర్తీ తదితర సమస్యలపై చర్చించారు. ఈ సమస్యలపై తప్పక ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కషి చేస్తామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారని తెలియజేశారు. జిల్లా ఉపాధ్యక్షులు వై లక్ష్మీపతి యాదవ్, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు హరి, పలమనేరు ఎన్జీవో మహిళా విభాగం అధ్యక్షురాలు జయ ప్రభావతి, నాగవేణి, మోహన్ రాంప్రసాద్, వివిధ తాలూకా కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, నాల్గవ తరగతి ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలను జగన్ కాపాడుకోవాలి



ప్రజాశక్తి-పలమనేరు: వైనాట్ 175 అంటూ ఉత్తర ప్రగల్భాలు పలుకుతున్న సిఎం జగన్ మోహన్ రెడ్డి ముందు తన పార్టీ ఎమ్మెల్యేలను కాపాడుకోవాలని మాజీ మంత్రి అమరనాథ రెడ్డి హితవు పలికారు. తెనాలి సభలో సీఎం చేసిన వ్యాఖ్యలపై స్పందించిన ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఒక్క ఛాన్స్ అంటూ ప్రజలను నమ్మించి అధికారం చేపట్టిన జగన్ రెడ్డి అరాచకాలు, అక్రమాలకు ఆంధ్రప్రదేశ్‌ను అడ్డాగా మార్చేశాడన్నారు. రాజకీయ పార్టీలన్నాక ప్రజా సంక్షేమం దష్ట్యా పొత్తులు పెట్టుకోవడం సహజమని మహా భారతం నుంచే పొత్తులు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ధర్మం, న్యాయం కోసం భావ సారూప్యం ఉన్న వారంతా కలిసి జట్టు కట్టిన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. 40 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానం ఉన్న పార్టీ తెలుగుదేశమని, పటిష్ట యంత్రాంగం, కార్యకర్తలు టిడిపి సొంతం అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఇకనైనా ప్రతిపక్షంపై పడి ఏడవడం మాని ప్రజలకు ఉపయోగ పడే కార్యక్రమాలు చేయాలని ఆయన సూచించారు.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకుందాం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకుందామని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు బుధవారం మండలంలోని ఉపాధ్యాయులను కలిసి పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డి, టీచర్ల అభ్యర్థి పొక్కిరెడ్డి బాబు రెడ్డిలను గెలుపు కోసం ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో బంగారుపాలెం మండలాల్లో విస్తత ప్రచారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ కార్మిక అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ శాసనమండలిలో ప్రశ్నించే వారిని ఎన్నుకోవాలని ప్రజా సమస్యలపై పోరాడేందుకు పిడిఎఫ్ అభ్యర్థులను ఎంపిక చేయాలన్నారు ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి దక్షిణామూర్తి జిల్లా నాయకులు సరిత,జెవికెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి శంకరన్ భవ నిర్మాణ కార్మికులు హేమంత్ జయరాం తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికలపై కలెక్టర్లతో సమీక్ష

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వర్చువల్ విధానంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు అవసరమైన పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌లపై ప్రత్యేక దష్టిపెట్టి బందోబస్తు వ్యవస్థను పటిష్ఠంగా ఉంచాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటింగ్ విధానంపై ఓటర్లకు అవగాహన పెంచాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు చిత్తూరు జిల్లా సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఎం.హరి నారాయణన్ పాల్గొని మాట్లాడారు. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఆరు జిల్లాల డిఆర్‌ఓలు, ఆర్‌డిఓలతో సమన్వం చేసుకోవడం జరుగుతున్నదని, ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈనెల 7వ తేదీ లోపు ఓటర్ల స్లిప్పులు పంపిణీ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు ఎఎస్పీ జగదీష్, ఆర్‌డిఓలు రేణుకా, సృజన, శివయ్య, అధికారులు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పులు బీఎల్‌వోలతో పంపిణీ : జెసి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు స్లిప్పుల పంపిణీ బిఎల్‌ఓల ద్వారానే పంపిణీ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి జిల్లా సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా జాయింట్ కలెక్టర్, డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, జెడ్పి సీఈఓ ప్రభాకర్ రెడ్డితో కలిసి అన్ని శాఖల జిల్లాస్థాయి అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దారులు, ఎంపీడీఓలతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మార్చి 13న జరిగే పోలింగ్‌లో భాగంగా ఓటర్లకు స్లిప్పుల పంపిణీ బిఎల్‌ఓల ద్వారానే చేయాలని, పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఓటింగ్ విధానంపై అవగాహన కార్యక్రమాలను విస్తతం చేయాలన్నారు. స్పందన, ఏపీ సేవా, మీసేవల ద్వారా అందిన అర్జీలను పరిష్కరించాలన్నారు. ఆర్డీఓలు రేణుక, సజన, శివయ్య వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీ

ప్రజాశక్తి-నింద్ర: స్థానిక పంచాయతీలో సచివాలయ కన్వీనర్లు రేవతి మునస్వామి రెడ్డి, కుప్పరాజు, శివలింగం రెడ్డి, చార్లెస్ రాజ్ కుమార్, గహ సారథులు ప్రభుత్వం అందించే వద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, వికలాంగ పెన్షన్‌ను పంపిణీ పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ శుభారాం, మండల సోషల్ మీడియా కన్వీనర్ వెంకటేష్ రెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీటి కొళాయి

ప్రజాశక్తి-గుడిపల్లి: మండలంలోని అగరం గ్రామపంచాయతీలో సర్పంచ్ లావణ్య గోపాల్ ఆధ్వర్యంలో ఇంటింటికి మంచినీటి కొళాయిలు అమర్చడానికి బుధవారం జెసిబి తో కాలువలు తీసి పనులు ప్రారంభించినట్లు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ వేసవిలో తాగునీటికి ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా ఉండాలనే ఆకాంక్షతో ఈ పనులు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-పలమనేరు: పట్టభద్రులు, టీచర్స్ శాసన మండలి ఎన్నికలకు సంబంధించి మున్సిపాలిటీ పరిధిలోని గర్ల్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ కుప్పస్వామి, ఎంపీడీవో విద్యాసాగర్, ఎస్ఐ నాగరాజులు బుధవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో జరగడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు ఎంఆర్ఒ తెలిపారు.

పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-నగరి: మండలంలోని ఎం.కొత్తూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో పీఎస్ శ్రీదేవి వార్షిక తనిఖీ నిర్వహించారు. బుధవారం ఆమె సాయంత్రం వరకు పాఠశాలలో నిర్వహించే అన్ని కార్యక్రమాలను పరిశీలించారు. పిల్లల నోట్స్ కరెక్షన్, వర్క్‌బుక్ కరెక్షన్, అకడమిక్ క్యాలెండర్ ప్రకారం నిర్వహిస్తున్నారా అన్న అంశాన్ని గమనించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, సమయపాలనను పరిశీలించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా, పాఠశాల ఆవరణల పరిశుభ్రతను పరిశీలించారు. సీఈసీ గ్రేడింగ్ రిజిష్టర్ తనిఖీ చేశారు. పరిశీలించిన అంశాలపై సంతప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయులు శేఖర్, సీఆర్పీ మునస్వామి పాల్గొన్నారు.

ఘనంగా స్టాలిన్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-నగరి: మున్సిపల్ పరిధి ఏకాంబరకుప్పంలో డీఎంకే పార్టీ నాయకులు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ 70వ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. డీఎంకే నాయకుడు వివి లోకనాథన్ ఆధ్వర్యంలో స్థానిక అన్నాదొరై విగ్రహానికి పూలదండలు వేసి పలువురికి అన్నదానం చేశారు. అనంతరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు అభ్యసనా సామగ్రిని వితరణగా అందించారు. స్థానిక డీఎంకే పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్టు



ప్రజాశక్తి-చౌడేపల్లె: చౌడేపల్లి పోలీసులు హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రవికుమార్ కథనం మేరకు వివరాలు.. కర్ణాటక రాష్ట్రం, చిక్ బళ్లాపురం జిల్లా, చింతామణి తాలూకా, జాతర్లకొత్తపల్లి గ్రామానికి చెందిన రామన్న గారి రెడ్డప్ప కుమారుడు శ్రీనివాసులును ఎదురుపడిన వారందరినీ నోటికి వచ్చినట్లు తిడుతూ రాళ్ళతో జనాలపైకి దాడి చేస్తుండేవాడని, దీంతో అదే గ్రామానికి చెందిన దారాల వేణుగోపాల్ (26),షేక్ మొహమ్మద్ అలీ (42), షేక్ మౌలా (23) లు సదరు వ్యక్తిని చంపేయాలని నిర్ణయించుకొని, పుంగనూరు-ఏ.కొత్తకోట రోడ్డులో చంపినట్టు తెలిపారు. అనంతరం సాక్ష్యం లేకుండా చేయుటకు శ్రీనివాసులు శరీరంపై ఉండే షర్టును మార్చేసి వెళ్ళిపోయారు.ఈ ఘటనపై మతుడు శ్రీనివాసులు తండ్రి రెడ్డప్ప ఫిర్యాదు మేరకు చౌడేపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.ఈ నేపథ్యంలో ముద్దాయిలు మంగళవారం చౌడేపల్లి మండలం, ఏ.కోత్తకోట పంచాయతీ వీఆర్ఓ జ్యోత్స్న దగ్గర లొంగిపోగా, ఆమె వారిని పుంగనూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి .మధుసూదన్ రెడ్డి ముందు చౌడేపల్లె పోలీస్ స్టేషన్‌లో హాజరుపరచామన్నారు. అనంతరం ముద్దాయిలను సీఐ కె.మధుసూదన్ రెడ్డి అరెస్టు చేసి, వారు చంపడానికి ఉపయోగించిన కట్టెను, శ్రీనివాసులు షర్టును స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్ నిమిత్తం పుంగనూరు కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

ఏనుగుల దాడులు



ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని కోగిలేరు గ్రామపంచాయతీ పరిధిలోని కోగిలేరు, పొట్టగానిపల్లె సమీపంలోని వ్యవసాయ పొలాల్లో మంగళవారం రాత్రి ఏనుగుల గుంపు దాడి చేయడంతో పంటలు ధ్వంసమయ్యాయి. అర్ధరాత్రి కోగిలేరు అటవీ ప్రాంతం నుండి ఏనుగుల గుంపు పొట్టగానిపల్లె సమీపంలోని వ్యవసాయ పొలాల్లో పంటలను ధ్వంసం చేస్తుండడంతో గ్రామస్తులు గుర్తించి డప్పులు కొట్టగా ఏనుగుల గుంపు అటవీ ప్రాంతం వైపు వెళ్లిపోయినట్లు రైతులు తెలిపారు. అప్పటికే కోగిలేరులోని వెంకటరెడ్డి కర్బూజా పొలం, గల్లా మణి వరి, పొట్టగానిపల్లె శంకరప్ప పుచ్చకాయ, నాగేష్, నాదమునిల వరి పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. దీంతో సుమారు రూ.4 లక్షలు మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక రైతుల ద్వారా సమాచారం తెలుసుకున్న వీఆర్వో సుధాకర్, సచివాలయ సెరికల్చర్ అసిస్టెంట్ నరేష్ ఏనుగుల దాడిలో నష్టపోయిన రైతుల పంటలను పరిశీలించారు. అనంతరం ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించనున్నట్లు తెలిపారు.

మొరాయించిన 108 వాహనం



ప్రజాశక్తి-వెదురుకుప్పం: 108 వాహనం మొరాయించిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. రోడ్డుపై మొరాయించడంతో స్థానికుల సహాయంతో ముందుకు నెట్టించి వాహన చోదకుడు స్టార్ట్ చేసుకున్నాడు. మండలంలో ఎక్కడైనా ప్రమాదం జరిగితే 108 కి సమాచారం అందిస్తే ఆగ మేఘాలపైన సంఘటనా స్థలానికి కుయ్ కుయ్ అంటూ చేరుకునే వాహనం ఇలా రోడ్డుపై నిలిచిపోవడంతో చూసిన వారు విమర్శలను సంధించారు.

వైసీపీతోనే రైతుల సంక్షేమం



ప్రజాశక్తి-పుంగనూరు: రాష్ట్రంలో వైసీపీ రైతుల పక్షపాతిగా వ్యవహరిస్తుందని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు రాజా అన్నారు. రైతుల ఖాతాల్లో నగదు జమ చేయడంపై స్థానిక అంబేద్కర్ సర్కిల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చిత్రపటాలకు దళిత సంఘాల ఆధ్వర్యంలో బుధవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఖాతాల్లో నగదు జమ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. రైతును రాజు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రైతుల అభివద్ధి కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంట్ సభ్యులు మిథున్ రెడ్డి సహకారంతో మండలంలో రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందుతున్నాయని అన్నారు. వైసీపీ రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నది. సీఎం జగన్, రాష్ట్ర మంత్రి రామచంద్రారెడ్డికి రుణపడి ఉంటామని అన్నారు. రాష్ట్రదళిత సంఘాల నాయకుడు శంకరప్ప, పెంచుపల్లి కష్ణప్ప, చిన్నరాయడు, బాలాజీ, విజయ్, అశోక్, నరసింహులు, రామ్మూర్తి, సుధాకర్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.